
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 29 । ఆగస్టు । 2024



సోమశిలలో 34.419 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 34.419 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3555 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,930
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,697
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,898
నవర (8 గ్రాములు)	రూ.55,184

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.3 /27.5

గాలిలో తేమ 64 శాతంగా బుధవారం నమోదైంది. జిల్లాలో వాతావరణం గురువారం మబ్బులు చేసి ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

ప్రత్యేక చట్టంతోనే రక్షణ



మహిళలు, మహిళా డాక్టర్లపై వేధింపులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి. ఇప్పుడున్న చట్టాలతో శిక్ష నుంచి తప్పించుకోవడం దుండగులకు సాధ్యమవుతుంది. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన అకృత్యం అమానుషం. ప్రత్యేక చట్టాన్ని రూపొందించి శిక్ష వెంటనే అమలయ్యేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– శర్వాణి, నేత్ర వైద్యురాలు, జిల్లా ప్రభుత్వాస్పత్రి, ఆత్మకూరు

భద్రత కల్పించాలి



డాక్టర్లను దేవుళ్లుగా కీర్తిస్తుంటారు. అలాంటి వీరికి ప్రస్తుత రోజుల్లో రక్షణ కరువవుతోంది. వీరికి ప్రభుత్వం భద్రతతో పాటు భరోసా కల్పించాలి. రోగుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పనిచేసే వైద్యులపై దాడికి పాల్పడటం దారుణం. ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి.

– లీలావతి, డాక్టర్, ప్రభుత్వాస్పత్రి, ఆత్మకూరు

దాడులకు పాల్పడితే వైద్యం చేసేదెలా..?



ఇటీవలి కాలంలో డాక్టర్లపై దాడులు అధికమవుతున్నాయి. ప్రశాంత వాతావరణంలోనే చక్కని వైద్యాన్ని వైద్యులు అందించగలరు. దాడులకు పాల్పడుతుంటే వైద్యం చేసేదెలా..? కోల్‌కతాలో జరిగిన దారుణ ఘటనకు కారకులపై కఠిన చర్యలు చేపట్టి న్యాయం చేయాలి. పటిష్ట చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– బాలాజీ, వైద్యుడు, ప్రభుత్వాస్పత్రి, ఆత్మకూరు



న్యూస్‌రీల్

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

- ముగ్గురి దుర్మరణం
- మృతులు నెల్లూరు వాసులు



మహిళ మృతదేహం

చింతామణి: టెంపో ట్రావెలర్, కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళతో సహా ముగ్గురు మరణించగా, 12 మంది గాయపడిన ఘటన చిక్కబళ్లాపుర జిల్లా చింతామణి వద్ద కంచార్లపల్లి పరిధిలో గల దండుపాళ్యం గేట్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. శ్రీనివాసులు (45) శ్రీకాంత్ (40) పుష్ప (42) కారులో బెంగళూరు నుంచి బయల్దేరారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న టెంపో ట్రావెలర్ అతివేగంతో ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయింది. కారులోని వీరు అక్కడికక్కడే మరణించారు. మృతులు నెల్లూరు జిల్లాకు చెందిన వారని పోలీసులు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్పీ కుశాల్ చౌక్సి, పోలీసులు పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు.

గృహ నిర్మాణాలపై విచారణ



పొదలకూరు: మండలంలోని పలు గ్రామాల్లో పక్కా గృహాల నిర్మాణాలపై ఇంజినీరింగ్ విభాగ విజిలెన్స్ అధికారులు విచారణను బుధవారం నిర్వహించారు. అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పొదలకూరు, పులికల్లు, మహ్మదాపురం, వెలికంటిపాళెం, నేదురుమల్లి తదితర గ్రామాల్లో క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పక్కా గృహాల నిర్మాణానికి కేటాయించిన కమ్ములు, సిమెంట్ రికార్డులను పరిశీలించారు. పొదలకూరు గోదాములో ఉన్న సిమెంట్, కమ్ములను తనిఖీ చేశారు. హౌసింగ్ ఏఈ శివమోహన్ పాల్గొన్నారు.

డీసీపల్లిలో 615 బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 615 బేళ్లను బుధవారం విక్రయించామని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 742 బేళ్లు రాగా, వీటిలో 615 బేళ్లు విక్రయమవ్వగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. వేలంలో 75,662 కిలోల పొగాకును విక్రయించగా, రూ.2,16,02,450 వ్యాపారం జరిగిందని పేర్కొన్నారు. గరిష్ట ధర కిలో రూ.358.. కనిష్ట ధర రూ.195.. సగటు ధర రూ.285.51గా నమోదైందని చెప్పారు. వేలానికి 14 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు.


పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు కౌన్సెలింగ్

నెల్లూరు(దర్గామిట్ట): గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ – 5, 6 డిజిటల్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్‌ను కలెక్టర్ ఆదేశాలతో నిర్వహించనున్నామని డీపీఓ సుస్మిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 30వ తేదీ ఉదయం పది నుంచి నిర్వహించనున్నామని చెప్పారు. గ్రేడ్ – 6 డిజిటల్ అసిస్టెంట్లకు 31వ తేదీ ఉదయం పది నుంచి ప్రక్రియను జరపనున్నామని వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ఎమ్మెల్యేలా.. డమ్మీలా..!

రెడ్‌బుక్ క్లియరెన్స్ ఉంటేనే బదిలీలు

- సిఫార్సు లేఖలు బుట్టదాఖలు
- పదవులుండీ పెత్తనం చేయలేని నిస్సహాయత
- ఇదీ జిల్లాలోని అధికార పార్టీ శాసనసభ్యుల పరిస్థితి



హమ్మయ్య.. తమ పార్టీ అధికారంలోకి వచ్చింది.. ఇక మనకు తిరుగులేదు.. తమకు అనుకూలమైన పోలీసులను సిఫార్సు లేఖల ద్వారా నియమించుకోవచ్చు.. ఇక మనదే హవా.. ఇలా జూన్ నాలుగో తేదీన ఫలితాలు వెల్లడయ్యాక టీడీపీ తరఫున ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు ఆనందడోలికల్లో విహరించారు. అయితే వీరి కలలు ప్రస్తుతం కల్లలయ్యాయి. శాసనసభ్యులుగా విజయం సాధించినా.. తమ సిఫార్సు లేఖలు బుట్టదాఖలవుతుండటంతో వైరాగ్యం వీరిని కమ్మేస్తోంది. పదవులుండి ఏమి ప్రయోజనమనే నిస్సహాయత ఆవహిస్తోంది. రెడ్‌బుక్ క్లియరెన్స్ ఉంటేనే బదిలీలని ఆ పార్టీలో నంబర్ – 2 చినబాబు స్పష్టం చేయడంతో దిక్కుతోచని స్థితిలో విలవిల్లాడటం పచ్చపార్టీ ఎమ్మెల్యేల వంతవుతోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అనుకున్నదొక్కటి.. అయినది ఇంకొక్కటి అన్న రీతిలో టీడీపీ ఎమ్మెల్యేల పరిస్థితి తయారైంది. ఆ పార్టీ అధిష్టానం అనుసరిస్తున్న తీరుతో వీరు డమ్మీలుగా మారారనే టాక్ సర్వత్రా నడుస్తోంది. నియోజకవర్గ స్థాయిలో ఎస్సైల నుంచి సీఐల బదిలీల వరకు తమకే పెత్తనం ఉంటుందని వీరంతా భావించారు. అయితే వీరి ఆశలను అడియాశలు చేస్తూ చినబాబు పైస్థాయిలో మంత్రాంగం నడిపిస్తున్నారు.

ఆయన ఆజ్ఞ లేనిదే ఏమీ జరగదు..!

తమను అనుకూలమైన వ్యక్తులను ఫలానా చోట నియమించాలని ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినా అవి బుట్టదాఖలవుతున్నాయి. రెడ్‌బుక్ క్లియరెన్స్‌లో ఓకే లభిస్తేనే కానిస్టేబుల్ నుంచి ఎస్పీ వరకు.. అధికారి నుంచి కలెక్టర్ వరకు పోస్టింగ్‌లు లభిస్తున్నాయంటే పరిస్థితి తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. చినబాబు ఆజ్ఞ లేనిదే చిన్న పోస్టింగ్‌ను సైతం ఇవ్వలేమని ఉన్నతాధికారులు తెగేసి చెప్తున్నారు. చిన్న పోస్టింగ్‌ను సైతం ఇప్పించుకోలేక.. ఆ బాధను ఎవరితో పంచుకోలేక.. సైకిల్ పార్టీ ఎమ్మెల్యేల ఆవేదన అంతా ఇంతా కాదు.

కలలు.. కల్లలు

అధికారంలోకి వచ్చాక తమ దర్పాన్ని ప్రదర్శిద్దామని కలలుగన్న ఎమ్మెల్యేలు చివరికి డమ్మీలయ్యారు. ఏది చేయాలన్నా చినబాబు టీమ్ అనుమతి కావాల్సిందే. అక్కడి నుంచి క్లియరెన్స్ వస్తేనే తామేమైనా చేయగలమని ఎమ్మెల్యేలకు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆయన్ను కలిసి చెప్పలేక.. పనులు కాక.. తమ ముఖం చూపించలేక వీరి పరిస్థితి దయనీయంగా మారుతోంది.

అలకపాన్పుపై..

మంత్రులు, జిల్లా ముఖ్యనేతలతో పాటు ఉన్నతాధికారులతో చెప్పించినా.. చివరికి డీజీపీని కలిసి అభ్యర్థించినా ప్రయోజనం లభించడంలేదు. ఈ తరుణంలో కొత్త పేర్లను ఇవ్వకుండా అలకపాన్పుపై కూర్చున్నారని సమాచారం. మరోవైపు ఎవరు అలిగినా.. ఆగ్రహించినా.. స్పందించకుండా, తమకేమనే రీతిలో చినబాబు టీమ్ సాగుతోంది. ఓ వర్గ మీడియా ప్రతినిధులు.. టీఎన్ఎస్ఎఫ్ నేతలు.. యువగళం పాదయాత్రలో పాల్గొన్న టీడీపీ యువ నేతలతో పోలీస్ అధికారులపై సమాచారాన్ని తెప్పించుకొని దాని ప్రకారమే క్లియరెన్స్ ఇస్తున్నారని తెలుస్తోంది. ఈ పరిణామాలతో టీడీపీకి అనుకూలంగా ఉండే వారికి మినహా ఇతరులకు ఎస్సై పోస్టింగుల్లో అవకాశాలు లభించడంలేదు.

ఓ సామాజికవర్గమే టార్గెట్



జిల్లా పోలీస్ శాఖలో ఓ వర్గాన్ని చినబాబు రెడ్‌బుక్ టీమ్ టార్గెట్ చేసింది. బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు సీఐల పోస్టింగ్ విషయంలో ఎంతో జాప్యం జరిగినా, చివరికి రహస్యంగా ఇచ్చిన పరిస్థితి. ఎనిమిది మంది ఎస్సైలు ఓ సామాజికవర్గానికి చెందిన వారే ఉన్నారు. ఇందులో ఒక్కరికి మాత్రమే ఓ డీఎస్పీ సిఫార్సుతో పోస్టింగ్ వచ్చింది. కృష్ణపట్నం పోర్టు, ఇందుకూరుపేట, కొడవలూరు, ఆత్మకూరు, చేజర్ల పోలీస్‌స్టేషన్లకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేలు చేసిన సిఫార్సులు బుట్టదాఖలయ్యాయి. విధి నిర్వహణలో ఆయా ఎస్సైలు సమర్థంగా పనిచేసేవారే. ఎస్పీ నుంచి ప్రశంసపత్రాలనూ వీరు అందుకున్నారు. అయితే పోస్టింగ్‌ల విషయానికి వచ్చేసరికి పక్కనబెట్టారు. జిల్లా అధికారుల విషయంలోనూ ఇదే ఫార్ములాను అవలంబిస్తున్నారు. బదిలీల విషయంలో అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని తమ సన్నిహితుల వద్ద ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చినబాబు టీమ్.. ఎమ్మెల్యేల మధ్య అంతర్యుద్ధం నడుస్తోందనే వదంతూ షికారు చేస్తోంది.

విజిలెన్స్ పేరిట వసూళ్లు

- ఇరిగేషన్ శాఖలో పనులపై విచారణకు సోమిరెడ్డి ఫిర్యాదు
- ఎంక్వైరీ నుంచి ఊరటకు నగదు వసూళ్లు
- రూ.50 లక్షలు సేకరించి అదే మొత్తంలో మరోసారి డిమాండ్
- ఇదంతా షాడో ఎమ్మెల్యేకేనని తెలిపిన అధికారి
- గొడవకు దిగిన సహచరులు • వీధిన పడ్డ వసూళ్ల పర్వం





విజిలెన్స్ అనే పదానికి ఉన్న పవిత్రతనే అధికార పార్టీ ఎమ్మెల్యే మార్చేశారు. పనుల నాణ్యత, ఇతరత్రా అంశాలపై విచారణ జరిపే ఈ శాఖను ఉపయోగించుకొని అందినకాడికి దండుకోవాలనే లక్ష్యంతో సదరు శాసనసభ్యుడు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. విజిలెన్స్ విచారణను తప్పించుకోవాలంటే ఇంత మొత్తాన్ని ఇవ్వాలని షరతు విధించడం.. ఆపై సేకరించిన మొత్తాన్ని షాడో ఎమ్మెల్యేకు అప్పగిస్తామని సదరు అధికారి చెప్పడం జిల్లాలో జరుగుతున్న దోపిడీ పర్వానికి ఉదాహరణగా మారుతోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ రెండున్నర నెలల పాలనలో సరికొత్త దందాకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెరలేపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై నెల్లూరు జలవనరుల శాఖ కార్యాలయంలో విజిలెన్స్ విచారణ పేరుతో సాగిస్తున్న వసూళ్ల దందా వీధిన పడింది. విచారణను నిలిపేయించేందుకు రూ.కోటి ఇవ్వాలని సదరు అధికారులను కార్యాలయ డివిజన్ మేనేజర్‌గా ఉన్న అధికారి పట్టుబట్టడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇలా వసూలు చేసిన నగదును సర్వేపల్లికి చెందిన షాడో ఎమ్మెల్యేకు అప్పగించాలని ఇరిగేషన్ అధికారి బహిరంగంగా చెప్పడంతోనే దందా ఏ మేర సాగుతోందో అర్థం చేసుకోవచ్చు.

వసూళ్ల కోసమేనా విచారణ..?

గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ పరిధిలో జరిగిన పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ జరపాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గతంలో ఫిర్యాదు చేశారు. సెంట్రల్ డివిజన్లో అప్పట్లో జరిగిన పూడికతీత పనులపై విచారణ చేపట్టేందుకు గానూ వివరాలు, రికార్డులను అప్పగించాలని ఇరిగేషన్ అధికారులను విజిలెన్స్ అధికారులు కోరారు. రికార్డులను డివిజన్ కార్యాలయానికి ఎండార్స్ చేసి విజిలెన్స్ అధికారులకు అప్పగించనున్నారు. ఈ వ్యవహారం కొన్ని రోజులుగా సాగుతోంది.

రంగంలోకి దిగిన వివాదాస్పద అధికారి

నెల్లూరు ఇరిగేషన్ సెంట్రల్ కార్యాలయంలో విజిలెన్స్ విచారణను నిలిపేయిస్తానంటూ అదే కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్న వివాదాస్పద అధికారి రంగంలోకి దిగారు. తనకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో బాగా పరిచయముందని, ఆయన ద్వారా విచారణకు బ్రేక్ పడేలా చేస్తానని, దీనికి రూ.50 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంటుందని తోటి అధికారుల నుంచి వసూలు చేశారని సమాచారం. ఈ తరుణంలో అధికారులు సైతం రూ.50 లక్షల వరకు సర్దుబాటు చేశారు. అయితే ఈ మొత్తాన్ని ఇస్తామంటే వారు అంగీకరించడంలేదని, మరో రూ.50 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారని సదరు మేనేజర్ సెలవిచ్చారు. దీంతో అధికారుల మధ్య వివాదం చెలరేగింది. ఇంత మొత్తాన్ని తామివ్వలేమని వారు తెగేసి చెప్పడంతో వివాదం పెద్దదై బాహాబాహీకి దిగారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారు ఈ తంతును చూసి నివ్వెరబోయారు.

ఆది నుంచి అంతే..

ఆది నుంచి సదరు అధికారి తీరు వివాదాస్పదమే. అవినీతి కోణం వెలుగు చూడటంతో గత ప్రభుత్వ హయాంలో ఆయన్ను బదిలీ చేశారు. తాజాగా టీడీపీ మరోసారి అధికారంలోకి రావడంతో సదరు అధికారి ఇక్కడికే వచ్చారు. ఈయన బ్యాంక్ ఖాతాను పరిశీలిస్తే ఎంత మేర వసూలు చేస్తున్నారనే అంశం వెలుగులోకి వస్తుందని సహచర అధికారులే చెప్పడం విశేషం.

మా ట్రాక్టర్లనే పట్టుకుంటావా..!

- కారు అడ్డుపెట్టి టీడీపీ నేత చిందులు
- వదిలేస్తావా.. లేదానంటూ సీఐకి బెదిరింపులు



పోలీస్‌స్టేషన్లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'నేను టీడీపీ నేతని.. మా ట్రాక్టర్లనే పట్టుకుంటావా.. వదిలేయకుంటే ఎంత దూరమైనా వెళ్తాం.. అవసరమైతే బదిలీ చేయిస్తా'.. ఇది కందుకూరు నియోజకవర్గంలో టీడీపీ ఇసుక మాఫియా గూండాగిరి. వివరాలు.. లింగసముద్రం మండలంలోని వీఆర్ కోట వద్ద గల మన్నేరు నుంచి మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం గుడ్లూరు సీఐ మంగారావుకు అందింది. వీఆర్‌కోట వద్దకు చేరుకొని ఇసుక లోడుతో వెళ్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్లకు కాపలాగా ఉన్న వలేటివారిపాళేనికి చెందిన టీడీపీ నేత హర్షకుమార్ కారులో వచ్చారు. ఇసుక ట్రాక్టర్లకు కారును అడ్డం పెట్టి సీఐతో వాగ్వాదానికి దిగారు. మా ట్రాక్టర్లను వదిలిపెట్టండి.. లేకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. దీంతో లింగసముద్రం ఎస్సై బాజీబాబును సిబ్బందిని తీసుకొని వీఆర్‌కోటకు రావాలని సీఐ సూచించారు. ఈ క్రమంలో ఎస్సై సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. మా ట్రాక్టర్లనే పట్టుకుంటారా అంటూ హర్షకుమార్ చిందులు తొక్కారు. ట్రాక్టర్ ఇంజిన్ నుంచి ట్రాలీని విడదీసి.. ఇంజిన్ టైర్లకు గాలి తీశారు. ఇప్పుడెలా తీసుకెళ్తారో చూస్తానంటూ సీఐ, ఎస్సైలపై ఆగ్రహించారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తాం.. వచ్చి చలానా కట్టి విడిపించుకోవాలని సీఐ చెప్పినా హర్షకుమార్ వినిపించుకోలేదు. దీంతో నాలుగు ఇసుక ట్రాక్టర్లు, ఇసుక లోడుతో ఉన్న ట్రక్కును పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. దీనిపై సీఐని సంప్రదించగా, ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించామని, ఎలాంటి వాగ్వాదం జరగలేదని చెప్పడం విశేషం.

ధ్యాసంతా సర్దుబాటుపైనే..



గాడి తప్పిన విద్యాశాఖ

- బోధనను గాలికొదిలేసిన వైనం
- 19 మండలాలకే రెగ్యులర్ ఎంఈఓలు
- పాఠశాలలపై పర్యవేక్షణ శూన్యం
- అధిక చోట్ల వర్గాలుగా విడిపోయిన ఉపాధ్యాయులు

జిల్లా విద్యాశాఖలో పాలన గాడితప్పింది. సర్దుబాటుపైనే దృష్టంతా కేంద్రీకరిస్తూ బోధనను గాలికొదిలేశారు. వెరసి పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఈ తరుణంలో తనిఖీలు జరగక.. ఎవరికి వారే యమునా తీరేననే చందంగా వ్యవహరిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయులు వర్గాలుగా విడిపోయి పరస్పర ఫిర్యాదులకు ప్రాధాన్యమిస్తుండటంతో అస్తవ్యస్త పరిస్థితి నెలకొంది.



నెల్లూరులోని కేఎన్నార్ స్కూల్

నెల్లూరు (టౌన్): జిల్లాలో పాఠశాల విద్యాశాఖ పరిస్థితి దారుణంగా మారింది. అంతా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యను గాలికొదిలేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వీరు ఆడిందే ఆటగా సాగుతోంది. ఫలితంగా ప్రభుత్వ కార్యక్రమాల అమలూ అంతంత మాత్రంగా మారుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 2,592 ప్రభుత్వ, 824 ప్రైవేట్ కలిపి మొత్తం 3,438 పాఠశాలలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 1,81,392 మంది.. ప్రైవేట్ స్కూళ్లలో 1,65,469 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల పర్యవేక్షణ, ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసం ఎంఈఓ – 1, 2లను నియమించారు.

- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు, ఉపాధ్యాయుల వేతనాలు, సర్దుబాటు, సిలబస్ ప్రకారం బోధన తదితరాలను ఎంఈఓ – 1 పర్యవేక్షించాలి.
- నాడు – నేడు, మధ్యాహ్న భోజనం, పీఎం పోషణ, యూడైస్ ప్లస్, కిట్ల పంపిణీ, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ఎంఈఓ – 2 పర్యవేక్షిస్తుంటారు. అయితే జిల్లాలోని అన్ని మండలాలకు ఎంఈఓ – 2లను నియమించలేదు.

సగం మండలాలకే..

వాస్తవానికి విద్యాశాఖలో ఎంఈఓ – 1 పాత్ర కీలకం. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా వీరు పర్యవేక్షించాల్సి ఉంటుంది. వారంలో రెండు లేదా మూడు పాఠశాలలను వీరు తనిఖీ చేయాలి. అయితే జిల్లాలోని 38 మండలాలకు గానూ 19 మండలాలకే రెగ్యులర్ ఎంఈఓలు ఉన్నారు. మిగిలిన చోట్ల ఇతర మండలాల ఎంఈఓ – 1లే ఇన్‌చార్జిగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. సీతారామపురం, వరికుంటపాడు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, విడవలూరు, కొడవలూరు, అల్లూరు, దగదర్తి, కావలి, బోగోలు, జలదంకి, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, నెల్లూరు అర్బన్, పొదలకూరు, రాపూరు, సైదాపురం మండలాల్లో రెగ్యులర్ ఎంఈఓ – 1లు ఉన్నారు.

కొలిక్కిరాని సర్దుబాటు

జిల్లాలో ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ జరుగుతోంది. ఈ నెల ఎనిమిదిన ప్రారంభమైన ప్రక్రియ ఉపాధ్యాయులు లేవనెత్తుతున్న అభ్యంతరాలతో రోజుల తరబడి సాగుతోంది. జిల్లాలో 870 మంది మిగులు ఉపాధ్యాయులున్నారని లెక్క తేల్చారు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటు జరుగుతుండగా, మండలాల్లో పూర్తయ్యాక డివిజన్లలో చేయాల్సి ఉంది. అనంతరం ఎస్జీటీలను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. మిగులు ఉపాధ్యాయుల్లో సగం మంది వీరే ఉంటారు. అర్హత కలిగిన ఎస్జీటీలను కొరత ఉన్న మండలాల్లో సబ్జెక్ట్ టీచర్లుగా నియమించాల్సి ఉంటుంది. అయితే ఈ కార్యక్రమం ఎప్పటికి పూర్తవుతుందో స్పష్టత లేదు.


పరస్పర ఫిర్యాదులు

ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడటంతో ఎవరికి వారే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు బదిలీపై వెళ్లేందుకు డీఈఓ తీవ్ర యత్నాలు చేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు మెజార్టీ పాఠశాలల్లో ఉపాధ్యాయులు రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలో ముగ్గురు డిప్యూటీ డీఈఓలు ఉన్నా, నామమాత్రంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ, పాఠశాలలపై కలెక్టర్ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఇవీ ఉదాహరణలు..

- కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డులోని జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు.. హెడ్‌మాస్టర్‌కు మధ్య విభేదాలున్నాయి. ఈ విషయమై డీఈఓకు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సిలబస్ మేరకు బోధించడంలేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో విచారణాధికారిగా ఆగమేఘాలపై డిప్యూటీ డీఈఓను నియమించారు. నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేయగా, ఆయన ఆదేశాలతో సదరు పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ప్రసన్నలక్ష్మి, శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు. ఇక్కడ గొడవలు నిత్యకృత్యమనే అంశం తేలింది.
- నెల్లూరులోని కేఎన్నార్ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న గదుల సన్‌షేడ్ కూలి తొమ్మిదో తరగతి విద్యార్థి గురుమహేంద్ర గత నెల 26న మృతి చెందారు. అయితే డీఈఓకు తెలియకుండా స్కూల్‌కు మరుసటి రోజు సెలవు ప్రకటించారు. ఈ విషయమై డీఈఓను సాక్షి ప్రశ్నించగా, ఆయన నీళ్లు నమిలారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. జిల్లాలోని మెజార్టీ పాఠశాలల్లో ఉపాధ్యాయుల మధ్య గొడవలు జరుగుతుండటం, సఖ్యత లేకపోవడం విద్యార్థుల పాలిట శాపంగా పరిణమించింది.

వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను పూర్తి చేశాం



ఉపాధ్యాయుల సర్దుబాటును మండల స్థాయిలో పూర్తి చేశాం. మిగిలిన ఉపాధ్యాయులకు డివిజన్ స్థాయిలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేస్తాం. ఉపాధ్యాయుల మధ్య విభేదాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తాం. సకాలంలో బోధన చేయని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు.

– రామారావు, డీఈఓ

వసతులు కల్పించాలి



ప్రభుత్వాస్పత్రుల్లో వసతులు కల్పించాలి. రాత్రివేళల్లో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కొందరు దురుసుగా కూడా ప్రవర్తిస్తుంటారు. రక్షణ కల్పిస్తే ఎలాంటి ఇబ్బందులుండవు. స్టాఫ్ నర్సులు, డాక్టర్లకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి.

– డి.గిరిజ, స్టాఫ్ నర్స్, మహ్మదాపురం

ఇబ్బందిగా ఉంటుంది



రాత్రివేళల్లో విధులు నిర్వహించాలంటే ఇబ్బంది ఉంటుంది. ఆస్పత్రుల్లో సరైన వసతులను కల్పిస్తే ధైర్యంగా పనిచేయొచ్చు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో నైట్ డ్యూటీలు చేసే స్టాఫ్ నర్సుల రక్షణ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.



– ఎ.వినీల, స్టాఫ్ నర్స్, మహ్మదాపురం



ఈ చిత్రంలోని యువకుడి పేరు షేక్ షాహుల్. నెల్లూరు వాసి. రావూస్ కాలేజీలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇతను ప్రస్తుతం ఆలిండియా నేషనల్ ఫెడరేషన్ ర్యాంకర్‌గా ఉన్నాడు. సౌత్ జోన్, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించాడు.



ఈ చిత్రంలోని యువకుడి పేరు మహ్మద్ షోయబ్. నెల్లూరు వాసి. ఇతను రావూస్ కాలేజీలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం ఆలిండియా నేషనల్ ఫెడరేషన్ ర్యాంకర్‌గా ఉన్నాడు. వివిధ స్థాయిల్లో ఆడి ప్రతిభ చూపాడు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వారి పేర్లు హారిక, తనూష, నిఖిల. వీరు నెల్లూరు వాసులు. నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ విద్యనభ్యసిస్తున్నారు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ స్థాయిలో పతకాలు సాధించారు.



ఈ చిత్రంలోని యువకుడి పేరు సాయితేజ. నెల్లూరు వాసి. నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చేస్తున్నాడు. సౌత్‌జోన్ సీనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు.

యుద్ధ క్రీడలో మనోళ్ల సత్తా

పెన్‌కాక్ సిలాట్.. ఇది అత్యంత ప్రాచీన యుద్ధ క్రీడ. ఇండోనేసియాలో విశేష ప్రాచుర్యం పొందింది. కొన్నేళ్ల క్రితం దక్షిణాదికి వ్యాపించింది. మన జిల్లాలో 2015 సంవత్సరంలో ఈ క్రీడ పరిచయమైంది. ప్రస్తుతం ఎంతోమంది ఇందులో రాణిస్తున్నారు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పెన్‌కాక్ సిలాట్, క్రీడాకారులపై ప్రత్యేక కథనం.

- పెన్‌కాక్ సిలాట్‌పై పెరుగుతున్న ఆసక్తి
- ఆహ్లాదంతోపాటు స్వీయరక్షణ
- నృత్యం సమ్మిళితమైన యుద్ధ కళ
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేకమంది ప్రతిభ
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని యువత, చిన్నారులను ప్రస్తుతం ఉర్రూతలూగిస్తున్న క్రీడ పెన్‌కాక్ సిలాట్. శాస్త్రీయ, ఆధునిక నృత్యాల సమ్మిళితమైన ఈ యుద్ధ కళ చూపరులకు వినోదాన్ని పంచడంతోపాటు గుర్తింపునూ కలిగిస్తోంది. ఇంతటి విశిష్టమైన క్రీడలో జిల్లాకు చెందిన అనేకమంది రాణిస్తున్నారు. ఏసియా మెడలిస్ట్ పి.మనోజ్ కుమార్ ఈ క్రీడను 2015లో ఏపీకి పరిచయం చేయడంతోపాటు నెల్లూరులో ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థులకు నేర్పించాడు. అనంతరం ఈ క్రీడ దినదినాభివృద్ధి చెందింది. నెల్లూరుకు చెందిన కోచ్ భరద్వాజ్‌రెడ్డి దీని రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి కావడంతో మరింత వేగం పుంజుకుంది. స్కూళ్లలో, కళాశాలల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం, టోర్నమెంట్లకు తీసుకెళ్లడంతో క్రీడాకారులు తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు.

ఆకట్టుకునే విన్యాసాలు

పెన్‌కాక్ సిలాట్‌లో క్రీడాకారులు ప్రదర్శించే విన్యాసాలు దాదాపు శాస్త్రీయ, ఆధునిక నృత్యాలను యుద్ధకళతో సమ్మిళితం చేసినట్లుగా కనిపిస్తాయి. కరాటేలోని స్ట్రైకింగ్ వేగం, కుంగ్ ఫూలోని త్రోయింగ్, జూడోలోని పట్లతో కూడిన ఈ క్రీడలో శరీరంలోని ప్రతి భాగాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది. దీంతో క్రీడాకారులు నిరంతర అప్రమత్తంగా ఉండేలా దోహద పడుతుంది. కరాటే, కుంగ్ ఫూ తదితర క్రీడల్లో ఉన్నట్లుగానే ఇందులోనూ ప్రధానంగా ఆరు విభాగాలను అభ్యసించాల్సి ఉంటుంది. రేగు, తుంగల్, గండ, సోలో, ఆర్టిస్టిక్, టాండింగ్ వంటి విన్యాసాల్లో ప్రావీణ్యం కనబరచాలి. ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రొఫెషనల్ కోర్సుల్లో, ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా ఉండడంతో సాధన చేసేందుకు అధిక శాతం మంది మక్కువ చూపుతున్నారు.

రాణిస్తున్న యువత

సిలాట్ క్రీడపై జిల్లా యువత, బాలబాలికలు శ్రద్ధ చూపుతున్నారు. బీటెక్, ఎంటెక్, పీజీ ఇతర విద్యార్థులు అధికంగా మక్కువ చూపించడం గమనార్హం. వారిలో యువతులు, బాలికలు ఎక్కువగా ఉన్నారు. స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు క్రమం తప్పకుండా ఉచిత శిక్షణను అందిస్తున్నారు. నెల్లూరు, కోవూరు, ధనలక్ష్మీపురం ప్రాంతాలతోపాటు పలువురు ఔత్సాహికంగా ఈ శిక్షణ అందిస్తున్నారు. ఇప్పటికే అనేకమంది పతకాలు సాధించారు. 2018లో ఇండోనేషియాలో జరిగిన జూనియర్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన వశీం, రిత్విక్‌లు ఆలిండియా ఫెడరేషన్ లెవల్లో 5, 6 స్థానాలను సాధించారు. ప్రస్తుతం 30 మందికి పైగా మహిళలు, పురుషులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఎస్.మల్లికార్జున, వశీంలు ఇందులో రాణించి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో గెజిటెడ్ అధికారి ఉద్యోగాలు సాధించారు.



తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

అద్భుత ఫలితాలు సాధిస్తారు



పెన్‌కాక్ సిలాట్ క్రీడలో జిల్లాకు చెందిన అనేకమంది గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు రాణిస్తున్నారు. ఆసియా ఖండంలో ప్రాచుర్యం పొందిన ఈ క్రీడను 2024 ఒలింపిక్స్‌లో డెమో క్రీడగా నిర్వహించారు. వచ్చే ఒలింపిక్స్‌లో ప్రవేశపెడతారు. ఖేలో ఇండియాతోపాటు ప్రభుత్వం మరింత సహాయ సహకారాలు అందిస్తే క్రీడాకారులు అద్భుత ఫలితాలను సాధిస్తారు.

– భరద్వాజరెడ్డి, పెన్‌కాక్ సిలాట్ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి

ఎర్రమట్టిని తరలిస్తూ..

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్
- ఆరుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా మెట్టి, గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతోందని విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఆయా వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఓ టిప్పర్ నెల్లూరు రూరల్ మండల పరిధిలోని కలివెలపాళెం నుంచి ఎర్రమట్టిని తీసుకుని ఇరుగాళమ్మ సంఘం వైపు వెళ్తూ ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన దర్గామిట్టలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. బుధవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. పుంగనూరు డిపోకు చెందిన ఇంద్ర బస్సు సుమారు 20 మంది ప్రయాణికులతో మంగళవారం విజయవాడకు బయలుదేరింది. అర్ధరాత్రి దాటిన తర్వాత నెల్లూరు దర్గామిట్టకు వచ్చేసరికి ఎర్రమట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ మితిమీరిన వేగంతో యూటర్న్ తీసుకునే క్రమంలో బస్సును ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. దాని డ్రైవర్లు కుమార్, సైపుల్లాఖాన్, క్లీనర్ ఆరీఫ్‌తోపాటు ప్రయాణికులు సిద్ధయ్య నాయుడు, నాగేశ్వరరావు, బాజీ సింగ్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఆర్టీసీ, సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ప్రయాణికులను మరో బస్సులో విజయవాడకు పంపారు. టిప్పర్‌ను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు తెలుసుకుంటున్నారు.

బడికి వెళ్లాలంటే భయంగా ఉంది

- విద్యార్థుల ఆవేదన
- ఎమ్మార్సీ ఎదుట నిరసన

తోటపల్లిగూడూరు: 'బడికి వెళ్లాలంటే భయంగా ఉంది. ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ మారు పేర్లతో హేళన చేస్తున్నారు' అని మండలంలోని ముంగళదొరువు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వాపోయారు. వారు తమ తల్లిదండ్రులతో కలిసి బుధవారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు మాట్లాడుతూ హెచ్‌ఎం తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. ఎంఈఓ వేణుగోపాలరెడ్డికి వారు వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన ఎంఈఓ హెచ్‌ఎంపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

సంగం: మండలంలోని వెంగారెడ్డిపాళెం వద్ద జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సంగం వైపు నుంచి నెల్లూరు వైపు టామోటా లోడుతో బొలెరో వాహనం వెళ్తోంది. కూరగాయల లోడుతో వెళ్తున్న మినీలారీ దానిని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం రోడ్డుకు ఒక వైపు పడగా.. మినీ లారీ మరోపక్క బోల్తా పడింది. దీంతో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. టమోటాలు రోడ్డు పక్కన పడిపోయాయి.



రోడ్డు పక్కన పడిపోయిన వాహనం, టమోటాలు

నిమ్మ ధరలు (కిలో)	
పెద్దవి	రూ.95
సన్నవి	రూ.60
పండ్లు	రూ.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	110
లేయర్ (లైవ్)	105
బ్రాయిలర్ చికెన్	204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	224
లేయర్ చికెన్	178

